క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్ రెడ్డి గుండె జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరామర్శ



రామలింగారెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న సతీష్‌కుమార్ రెడ్డి

చక్రాయపేట : మండలంలోని గండికొవ్వూరుకు చెందిన మోపూరి సుబ్బారెడ్డి, చిలేకాంపల్లెకు చెందిన దేశాయి రామలింగారెడ్డిల మృతి బాధాకరమని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మృతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించారు. మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు మృతి



మృతి చెందిన వెంకటసుబ్బయ్య

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరులో వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకొంది. శుక్రవారం ఎస్‌ఐ హృషికేశవరెడ్డి వివరాల మేరకు.. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య(77) గురువారం సాయంత్రం జోగాపురం-తాళ్లప్రొద్దుటూరు పాత మట్టి రోడ్డులో వాకింగ్‌కు వెళ్లి అక్కడే గుండె పోటుతో మృతి చెంది ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

స్థలం విషయమై ఘర్షణ

మైలవరం : మండల పరిధిలోని చిన్నవెంతుర్ల గ్రామంలో స్థల విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి ఇచ్చిన వివరాలు మేరకు గ్రామంలోని ఇంటి పక్కల వ్యవసాయ పనిముట్లు పెట్టుకోవడానికి కోసం స్థలం విషయమై ఇరు కుటుంబాలు ఘర్షణ పడ్డాయి. ఇందులో కొంత మందికి గాయాలు కావడం వల్ల జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలకు చెందిన మౌలాలిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి మరో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కమలాపురంలో 41.4 మి.మీ. వర్షపాతం

కమలాపురం : మండలంలో 41.4 మి. మీ. వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జామున వరకు మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన క్రిష్ణానగర్, మారుతి నగర్, అక్సానగర్, బ్రాహ్మణ వీధి, రామ్ నగర్ తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే చదిపిరాళ్ల, గోవులాపురం, పాచికలపాడు, జంభాపురం, పందిళ్లపల్లె, గొల్లపల్లె తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షంనీరు నిలిచారు.

అవగాహన కల్పించండి

పులివెందుల రూరల్ : నూతన మద్యం షాపుల లైసెన్సులకు సంబంధించి అవగాహన కల్పించాలని ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పులివెందుల ప్రొహిబిషన్‌ను ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. కొత్త మద్యం షాపులకు సంబంధించి ఈనెల 11న టెండర్లు పిలుస్తామన్నారు. గొడవలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, ఎస్‌ఐ రాంప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సూర్యనారాయణను శుక్రవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పరామర్శించారు.

జోరుగా అక్రమ ఇసుక తవ్వకాలు

- ఇసుక కావాలంటే 50 కిలోమీటర్లు వెళ్లాలి
- క్వారీలు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తీసుకు పోతున్న ట్రాక్టర్లు

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని పెన్నానదిలో జోరుగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు మండలాలకు చెందిన ప్రజలు నిర్మాణాల కోసం ఇసుక తెచ్చుకోవాలంటే 50కిలో మీటర్లు వెల్లవలసి వస్తోంది. కొండాపురం మండలంలోని చిత్రావతి నదిలో ఇసుకను తీసుకుని వచ్చి పెంజి అనంతపురం, వెంకటాపురం గ్రామాలలో డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. ఈ డంపింగ్ యార్డులలో ఇసుక టన్ను రూ.340 చెల్లించి తెచ్చుకోవలసి వస్తోంది. స్థానికంగా ఇసుక ఎద్దుల బండ్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. మండలంలో ఇసుక క్వారీలేని కారణంగా ఎద్దుల బండ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతోంది.

పెన్నా ఉన్నా క్వారీ ఏదీ...

పెన్నానది ఉన్నా ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండాపోయింది. ఇసుక అక్రమ రవాణా మాత్రం జోరుగా సాగుతూ ఇతర ప్రాంతాలకు తరలించి డబ్బులు సంపాదించుకుంటున్నారు. కర్నూల్, నంద్యాల జిల్లాలకు ఇసుకను ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తూ కనీసం ట్రాక్టర్‌కు రూ.14 వేలకు పైగా సంపాదించుకుంటున్నారు. స్థానికులకు మాత్రం ఇసుక దొరకడం కష్టంగా మారింది. నిత్యం పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ ఇసుక భారీగా బయటకు తరలిపోతుంది. అలాగే అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా కొండలను తవ్వి గ్రావెల్‌ను సైతం టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్నారు.

ధరలు తగ్గించాలి..

ప్రభుత్వం టన్ను ఇసుక రూ.340కి అమ్ముతున్నారు. అయితే స్థానికులు ఇసుక తెచ్చుకోవాలంటే రానుపోను వంద కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. ఒక్కొక్క ట్రాక్టర్‌లో నాలుగు టన్నుల ఇసుక నింపుకోవచ్చు. అయితే రవాణా ఖర్చు మాత్రం రూ. 5 వేలు నుంచి రూ.7 వేలు అవుతుంది. అదే టిప్పర్‌లో తెచ్చుకోవాలంటే కనీసం రూ.20 వేలు పైగా ఖర్చు వస్తోంది.

స్థానికంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలి



ఎక్కడో కొండాపురం మండలం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే భారీగా ఖర్చు అవుతుంది. ఇసుక ట్రాక్టర్ ద్వారా తెచ్చుకోవాలన్నా కనీసం రూ. 7 వేలు అవుతుంది. మధ్య తరగతి ప్రజలు అంత దూరం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే కష్టంగా ఉంది. కాబట్టి ప్రభుత్వం స్థానికంగా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచాలి.

– మిడుతల ప్రసాద్, సీపీఐ నాయకుడు

పెన్నానదిలో ఇసుక క్వారీలను ఏర్పాటు చేయాలి



ఇసుక క్వారీలు లేని కారణంగా మైలవరం, పెద్ద ముడియం ప్రాంతాల ప్రజలు ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నారు. కొండాపురం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే రెడింతల ఖర్చు అవుతోంది. పెన్నానది నుంచి ఇసుక మండల కేంద్రాల వద్ద డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలి.

– దాసరి విజయ్, సీఐటీయూ నాయకుడు

అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టే వారు హౌసింగ్ అధికారుల వద్ద అనుమతి తీసుకుని వస్తే అటువంటి వారికి పెన్నానదిలో నుంచి ఇసుక తీసుకు వెళ్లటానికి అనుమతులను ఇస్తాం. అలా కాకుండా అక్రమంగా ఇసుక తవ్వి వ్యాపారం చేస్తే కఠిన చర్యలను తీసుకుంటాం. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు తహసీల్దార్‌లకు అక్రమ ఇసుకపై చర్యలను తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలను జారీ చేశాం.

– ఎ.శ్రీనివాస్, ఆర్డీఓ,జమ్మలమడుగు

పులివెందుల అభివృద్ధి వైఎస్ కుటుంబం ఘనతే

- వంద రోజుల్లోనే పులివెందుల ప్రాంతాన్ని మట్కా, జూదం, అక్రమ మైనింగ్‌లతో భ్రష్టు పట్టించిన ఘనత బీటెక్ రవి, రాంగోపాల్‌రెడ్డిలదే
- టీడీపీ నాయకులపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ నాయకులు

పులివెందుల రూరల్ : పులివెందుల అభివృద్ధి చెందిందంటే అది వైఎస్ కుటుంబీకులదేనని వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గం నాయకులు తెలిపారు. శుక్రవారం భాకరాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు రాంగోపాల్‌రెడ్డి, బీటెక్ రవిలు మట్కా, జూదం, అక్రమ మైనింగ్‌ల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వారు అన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వందరోజులకే పులివెందుల ప్రాంతాన్ని మట్కా, జూదం, అక్రమ మైనింగ్‌లతో భ్రష్టు పట్టించిన ఘనత బీటెక్ రవి, రాంగోపాల్‌రెడ్డిలదే నన్నారు. కూటమి నాయకులు ఇసుక రీచ్‌లలో, హౌసింగ్ సైట్లలో ఉన్న వేల టన్నుల ఇసుక ను దౌర్జన్యంగా, అక్రమంగా రవాణా చేయలేదని చెప్పగలరా అన్నారు. ఉచిత ఇసుక అనేది కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. టీడీపీ నాయకులు ప్రజలకు అధిక ధరలకు ఇసుకను అమ్మిన మాట వాస్తవం కాదా, మీకు చిత్త శుద్ధి వుంటే వీటన్నింటిపై ప్రమాణం చేయడానికి మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. మీరు అధికారంలోకి రాగానే సజావుగా సాగుతున్న మైనింగ్ వ్యవస్థను, మైనింగ్ లీజు దారులను భయపెట్టి మీ వద్దకు రప్పించుకుని వారి నుంచి మీ నాయకులకు అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలను కట్టబెట్టింది వాస్తవం కాదా, మా కమిషన్ మాకు ఇచ్చి మైనింగ్ యథేచ్ఛగా జరుపుకోవచ్చునని మీరు, మీ నాయకులు మాట్లాడటం మీకు గుర్తు లేదా అన్నారు. ఈ రోజు ఒక చిన్న గ్రామంలో హత్యలు చేసుకునే దానికి కూడా జిలెటిన్ స్టిక్స్ లభిస్తున్నాయంటే ఈ ప్రభుత్వ వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో ఒక సారి వెన్నక్కి తిరిగి చూసుకోవాలన్నారు. నిజంగా వైఎస్ ప్రతాప్‌రెడ్డి అక్రమంగా, నిబంధనలకు వ్య తిరేఖంగా జిలెటిన్ స్టిక్స్ అమ్మిన దాఖలాలు లేవని, ప్రస్తుతం ఆయనకు లైసెన్స్ కూడా లేదు అనేది తెలియని దౌర్భాగ్య స్థితి నెలకొందన్నారు. వైఎస్ ప్రతాప్‌రెడ్డికి 2021 మార్చి లోనే లైసెన్స్ రద్దు చేయడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వంద కోట్లు పులివెందుల ప్రాంత అభివృద్ధికి నిధులు విడుదల చేసినట్లు పలకడం ఎంత వరకు సమంజసమన్నారు. పులివెందులలో ఎవరైతే మట్కా, జూదం ఆడిస్తున్నారో వారే పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ, సీఐ, డీఎస్పీలపైనా అజమాయి షీ చలాయిస్తున్న మాట వాస్తవం కాదా అన్నారు. 100 రోజుల పాలనలో కనీసం ఎక్కడైనా, ఏ పాఠశాలకైనా కనీస కుర్చీలు కూడా తెచ్చుకునే వెసులుబాటు కల్పించకపోవడం మీ దిక్కుమాలిన ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. పులివెందులలో ఎస్టీల భూమలను తక్కువ ధరకే కొనుగోలు చేసి అధికారులను మేనేజ్ చేసి డికేటీ భూములను నువ్వు ఎలా నీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నావ్ రాంగోపాల్‌రెడ్డి దీనిపై నువ్వు విచారణకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. వీటన్నిటిపై ఏ దేవాలయంలో మీరు ప్రమాణం చేస్తారో చెబితే అక్కడ అన్ని ఏర్పాట్లు మేమే చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, సింహాద్రిపురం మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రవిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తొండూరు మండల నాయకులు దశరథరామిరెడ్డి, రామమునిరెడ్డి, పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి

లింగాల : మండల ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన గాలివీడు మండలంలో ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆయన గతంలో లింగాల మండల ఈఓపీఆర్డీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చెన్నూరు ఎంపీడీఓగా కిరణ్‌మోహన్

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కిరణ్ మోహన్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ కర్నూలు జిల్లా నందికొట్కూరుకు బదిలీపై వెళ్లడం జరిగింది.

వేంపల్లె ఎంపీడీఓగా కుళ్లాయమ్మ

వేంపల్లె : ప్రొద్దుటూరులో పనిచేస్తున్న కుళ్లాయమ్మను వేంపల్లె ఎంపీడీఓగా నియమించారు. వేంపల్లె ఎంపీడీఓగా పనిచేస్తున్న దివిజ సంపతి ఖాజీపేటకు బదిలీ అయ్యారు.

వేంపల్లె పీఆర్‌డీఈగా సుధాకర్‌రెడ్డి

వేంపల్లె : మండల పంచాయతీరాజ్ డీఈగా సుధాకర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పులివెందులలో పీఆర్ డీఈగా పనిచేస్తున్న ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేసేందుకు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన డీఈకి సిబ్బంది స్వాగతం పలికారు.

సాగునీరు విడుదల చేయండి

లింగాల : తీవ్ర వర్షాభావం కారణంగా మండల వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని, వెంటనే పీబీసీ, లింగాల కుడికాలువల ఎత్తిపోతల పథకాల ద్వారా మండలంలోని చెరువులు, కుంటలకు సాగునీరు అందించాలని ఎంపీపీ రమాదేవి తెలిపారు.

శుక్రవారం లింగాల ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీతో పశువుల షెడ్లు, గొర్రెలలో నట్టల నివారణ మందులను అందిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఏఓ లోకేశ్వరరావు, ఎంఈఓ రామకృష్ణయ్య, మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయండి

పులివెందుల టౌన్ : అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన హౌసింగ్ పీడీ రాజారత్నంతో కలిసి మెగా లే అవుట్‌లో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణ పనులపై సెక్రటరీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇంటిని మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి, సచివాలయం అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు. అనంతరం ఆయన సంచార పన్ను వసూలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులు చెల్లించి ఆన్‌లైన్ రసీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మునికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అణు విద్యుత్ ఉత్పత్తిలో యూసీఐఎల్ కీలక పాత్ర

యూసీఐఎల్ ఎండీలు సంతోష్ కుమార్ సత్పతి, మనోజ్‌కుమార్



యూసీఐఎల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో ప్రాజెక్టు ఎండీలు, అధికారులు, సిబ్బంది

వేముల : యూసీఐఎల్ దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తి, యురేనియం అన్వేషణ, ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించిందని యూసీఐఎల్ ఎండీ సంతోష్ కుమార్ సత్పతి, యూసీఐఎల్ టెక్నికల్ ఎండీ మనోజ్ కుమార్, జీఎం ఎం.ఎస్.రావులు పేర్కొన్నారు. శుక్రవారం వేముల మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో యూసీఐఎల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగించారు. పర్యావరణ సుస్థిరత, సమాజ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి మేము ఎదురుచూస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులపట్ల నిబద్ధత, కార్యకలాపాలను విస్తరిస్తున్నప్పుడు మాకు మార్గదర్శకంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. యూసీఐఎల్ ప్రాజెక్టు పురోగతిని వారు వివరించారు. అనంతరం వారు వేదిక వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో యూసీఐఎల్ అధికారులు బి.శ్రీకాంత్, సి.మతివానన్, ఎల్.కోటేశ్వరరావు, కె.నాగరాజు, జె.డి.కన్నన్, హిమాన్షు తివారీ, డా.బి.నవీన్ కుమార్ రెడ్డి, టి.సి.ఎస్.రెడ్డి, ఇ.రాజు, హుస్సనయ్య, వాసుదేవ్ రెడ్డి, గంగాధర్, మునీర్, లక్ష్మీరంగయ్య, రవి, యూసీఐఎల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పోరాట సమితి నియోజకవర్గ కమిటీ ఎంపిక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురం రామాలయంలో శుక్రవారం ఉదయం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆ సమితి నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్యం చిన్నసుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల శివప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శిగా వంగనూరు గంగాధర్, వేముల మండల ఇన్‌చార్జిగా ఆర్లకుంట వెంకటకృష్ణ, పులివెందుల మండల ఇన్‌చార్జిగా దొండ్లవాగు రాము, పులివెందుల మహిళా ఇన్‌చార్జిగా వి.నిర్మల, తొండూరు మండల ఇన్‌చార్జి బ్రహ్మానందరెడ్డి, లింగాల మండల ఇన్‌చార్జిగా కమటం ఈశ్వరరెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా చిన్నసుబ్బయ్య మాట్లాడుతూ వికలాంగుల సమస్యల మీద పోరాటాలతోనే ఈరోజు పింఛన్ రూ.6వేలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా సమస్యలైన వికలాంగులకు రావలసిన త్రీ వీలర్ స్కూటర్లు, అలాగే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. వివాహ ప్రోత్సాహ బహుమతి రూ.1.50 లక్షలను వెంటనే మంజూరు చేయాలని, బ్యాంకు రుణాలను లక్ష రూపాయల నుంచి రూ.10 లక్షల వరకు ష్యూరిటీ లేకుండా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. వికలాంగులకు హక్కుల 2016 చట్టాన్ని వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని, ప్రతి వికలాంగుడికి వివాహంతో సంబంధం లేకుండా అంత్యోదయ కార్డు ద్వారా 35 కేజీల బియ్యం అందించాలని, వికలాంగుడు కుటుంబానికి ఆరు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాతయ్య, జిల్లా కార్యదర్శి గంగాధర్, నూతన కమిటీ సభ్యులు, తదిరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఎర్రగుంట్ల : గ్రామాలలో సమస్యలను పరిష్కంచమని అడిగితే కిందిస్థాయి అధికారుల నుంచి ఎలాంటి స్పందనలేదని ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. శుక్రవారం ఎంపీడీఓ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం జేడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ రహంతులయ్య మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత విద్యుత్ సమస్యలపై రూరల్ ఏఈ మాట్లాడుతుండగానే చిలంకూరు ఎంపీటీసీ సభ్యులు కొండయ్య లేచి వీధులలో విద్యుత్ లైట్లు వెలగలేదని అడిగితే కింద స్థాయి విద్యుత్ ఉద్యోగులు మాకు సంబంధంలేదంటున్నారని తెలిపారు. వలసపల్లెలో బోర్ వేయాలని జేడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్‌బేగం, వెలుగు ఏపీఎం జగదీశ్వరీ, పొట్లదుర్తి వెటర్నీ డాక్టరు జ్యోతి, గృహనిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణయ్య, ఉపాధి ఏపీఓ గంగాభవాని, పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌కుమార్, వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్లు డుమ్మా...

ఈ సమావేశంకు చిలంకూరు పీహెచ్‌సీ, ఎర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డుమ్మా కొట్టారు. వారి స్థానంలో కింది స్థాయి ఉద్యోగులైన హెల్త్ సూపర్‌వైజర్లు హజరైయ్యారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, డిప్యూటి తాహసీల్దార్ తేజేస్వినిలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : నిషేధిత పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏడీఏ నరసింహారెడ్డి హెచ్చరించారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం కమలాపురం డివిజన్ పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. నిషేధిత ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామన్నారు. యూరియా తదితర ఎరువులు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డు తప్పకుండా షాపులోనే ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన బ్రాండ్లు మాత్ర మే విక్రయించాలన్నారు. ఏఓలు, డీలర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : అనుమతులులేని పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను డీలర్లు అమ్మకూడదని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి గురుభాస్కర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు రశీదులతో ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే డీలర్ లైసెన్సులను రద్దుచేస్తామన్నారు.

పులివెందుల రూరల్ : మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి శుక్రవారం ఎరువుల దుకాణాలను, ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసి డీబీటీ మిషన్, ఎరువుల స్టాకు వివరాలను, స్టాకు రిజిష్టర్‌లను పరిశీలించారు. రబీ సీజన్‌కు అవసరమైన ఎరువుల లభ్యతను పరిశీలించి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎరువులు ఏవైనా అవసరమైతే తమకు తెలియజేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వల్లూరు (చెన్నూరు) : అనుమతిలేని పురుగు మందులను విక్రయించరాదని చెన్నూరు మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణం ముందు సూచిక బోర్డును ఏర్పాటు చేసి స్టాక్ వివరాలను బోర్డుపై ఉంచాలన్నారు.

పెండ్లిమర్రి : రైతులకు పురుగు మందుల దుకాణాదారులు ప్రభుత్వ నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ రేట్లు కన్నా అధికంగా విక్రయిస్తే అటువంటి వారి లైసెన్స్‌లు రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన సాయిశ్రీ

జమ్మలమడుగు : జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ అధికారిగా బొబ్బిలి ఆర్డీఓగా పనిచేస్తున్న ఆదిమూలపు సాయిశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆర్డీఓగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాస్ బదిలీ అయ్యారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెడ్మాస్టర్, పీఈటీలు

వేంపల్లె : అండర్-17 ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ శివమునెమ్మ తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రిలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు తమ పాఠశాల నుంచి ఆదిశేషారెడ్డి, వెంకటశ్రీరామ్, పుణీషకుమార్, సాయి, విష్ణు, ఈశ్వర్‌లు ఎంపికయ్యారు.